న్యూస్‌రీల్

క్రిస్మస్ శుభాకాంక్షలు



భూపాలపల్లి: కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ప్రజలకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకొనే క్రిస్మస్ పండుగ క్రైస్తవులకు పరమ పవిత్రమైనదని అన్నారు. క్రీస్తు బోధనలు ప్రతీ ఒక్కరికి ఆదర్శప్రాయమని తెలిపారు. ప్రేమను పంచడం, మంచి మనసుతో సేవచేయడం ఎలాగో క్రీస్తు బోధనలు తెలిపాయన్నారు. జిల్లా ప్రజలు పండుగను ఘనంగా జరుపుకోవాలని చెప్పారు. అందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని, ప్రజలకు ఏసుక్రీస్తు చల్లని దీవెనలు ఎల్లప్పుడూ మెండుగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



కాటారం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం మండలకేంద్రంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు పే స్కేలు అమలు చేసి తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం తరఫున కృషి చేయాలని మంత్రికి విన్నవించారు. సమస్యల పరిష్కారం కోసం 15 రోజులుగా సమ్మె చేస్తున్నామని.. సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకునేలా చూడాలని మంత్రిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గద్దల సుదర్శన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు చల్ల సునీత, డేటా ఎంట్రీ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు ఆకుదారి రాజు, సీఆర్‌టీలు విజయ, నళిని, పీజీ సీఆర్‌టీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అమిత్‌షాపై కేసు నమోదు చేయాలి



భూపాలపల్లి రూరల్: అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాపై కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అదనపు కలెక్టర్ అశోక్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ అమిత్‌షాను బీజేపీ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చల్లూరి మధు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దేవన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణాకర్, పిప్పాల రాజేందర్, మధుకర్‌రెడ్డి, రాజేందర్, సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భువన సుందర్, కౌన్సిలర్ ముంజాల రవీందర్ పాల్గొన్నారు.

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్



చంద్రశేఖర్



పురుషోత్తంరెడ్డి

భూపాలపల్లి అర్బన్: తెలంగాణ గెజిటెట్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా నుంచి ఇద్దరికి చోటు దక్కింది. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఒంటేరు చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శిగా ఎం.పురుషోత్తంరెడ్డిలను నియమించారు. రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించడం పట్ల జిల్లా అధ్యక్షుడు మండల రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి లక్ష్మణ్‌బాబు రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం



సురేందర్ రెడ్డి



మోత్కూరి కోటి

భూపాలపల్లి రూరల్: ఎస్‌పీడీసీఎల్ యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ కంపెనీ కమిటీలో జిల్లాకు చెందిన ఇద్దరిని మంగళవారం నియమించారు. జాయింట్ సెక్రటరీగా యాల్లా సురేందర్ రెడ్డి, కమిటీ సభ్యుడిగా మోత్కూరి కోటి ఎన్నుకున్నారు.

నేడు మంత్రి పర్యటన

మల్హర్: మండలంలోని మాల్లారం దబ్బగట్టు, పెద్దతూండ్ల గ్రామాల్లో నేడు (బుధవారం) ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

వరి నాట్లు ప్రారంభం



మల్లారంలో నాట్లు వేస్తున్న మహిళలు



ఎదిగిన నారు

- యాసంగి పనుల్లో రైతన్న నిమగ్నం
- 10వేల ఎకరాల్లో సాగుకానున్న వరి

మల్హర్: మండల వ్యాప్తంగా యాసంగి సాగు పనులు జోరందుకున్నాయి. మండలంలో 10వేలపైచిలుకు ఎకరాల్లో వరి సాగు కానున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. మండలంలోని తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల, చిన్నతూండ్ల, కొయ్యూరు, వల్లెకుంట తదితర గ్రామాల్లో రైతులు సాగు పనుల్లో బీజీ, బీజీగా గడుపుతున్నారు. సాధారణ వరి సాగుతో పాటు ఆడ, మగ వరి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. నారుమడులు ఆశాజనకంగా ఎదుగుతుండడంతో వరి నాట్లను రైతులు ప్రారంభించారు. బోర్లు, బావులు ఉన్న రైతులు ఇప్పటికే వరి నాట్లు వేస్తున్నారు. చెరువు సాగు పొలాల్లో నారుమడులు వేసి నాట్లకు సిద్ధమవుతున్నారు. పలు ప్రాంతాల్లో దమ్ము పనులు చేపడుతుండగా మహిళలు నారు సేకరణ, కట్టాలు కట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. దమ్ము పూర్తయిన చోట వరినాట్లు వేస్తున్నారు. నారు ముదరక ముందే వరి నాట్లు వేసుకోవాలని వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

సకాలంలో నాట్లు వేసుకోవాలి



సకాలంలో వరి నాట్లు వేసుకోవాలి. నారు ముదురితే పంట ఎదుగుదల లోపంతో పాటు దిగుబడులు తగ్గే ప్రమాదం ఉంది. వరుస పద్ధతిలో నాట్లు వేసుకోవాలి. వరి నాట్ల సమయంలో పంట భూముల్లో నీటి నిల్వలు అధికంగా లేకుండా చూసుకోవాలి. సస్యరక్షణ చర్యల వివరాల కోసం అందుబాటులో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలి.

– శ్రీజ, ఏఓ, మల్హర్

బస్టాండ్ పునర్నిర్మాణంపై మంత్రి దృష్టి



బస్టాండ్ వద్ద నాయకులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఆర్టీసీ బస్టాండ్ పునర్నిర్మాణంపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టి సారించారు. ఈ మేరకు స్థానిక నాయకులతో మంత్రి మంగళవారం రాత్రి బస్టాండ్ ఆవరణలో పరిశీలించారు. త్వరలో జరుగనున్న సరస్వతినది పుష్కరాలకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారని, వారి సౌకర్యార్థం బస్టాండ్ పునర్నిర్మాణంపై చర్యలు తీసుకుంటానన్నారు. ప్రస్తుతం ఉన్న చోటు కాకుండా ఇతర ప్రాంతంలోకి బస్టాండ్ మార్చాలని మంత్రి తెలుపగా, స్థానికులు అదే చోట ఉండాలని, అందరికి అందుబాటులో ఉంటుందని అన్నారు. బస్టాండ్ నుంచి గోదావరి వరకు రోడ్డు వెడల్పుతో సెంట్రల్ లైటింగ్ చేపట్టాలని స్థానికులు తెలిపారు. రోడ్డు వెడల్పులో డ్రైయినేజీతో పాటు ఇరువైపులా 8 నుంచి 10ఫీట్ల మేర రోడ్డు వెడల్పు పెంచాలని స్థానికులు మంత్రికి సూచించారు. ఆయన వెంట నాయకులు రాణిబాయి, కోట రాజబాపు, శ్రీనివాసరెడ్డి, అశోక్, ప్రభాకర్‌రెడ్డి, శకీల్, బాబా, రాజబాబు, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

కంకర కుప్పతో ఇబ్బందులు



రోడ్డుపైన ఉన్న కంకర

పలిమెల: మండలంలోని పంకెనలోని ప్రధాన రహదారిపై ఆరు నెలల క్రితం ఓ కాంట్రాక్టర్ సీసీ రోడ్డు వేయడానికి కంకర తీసుకొచ్చి రోడ్డుపై పోశాడు. రోడ్డు వేయకపోగా ఆరోడ్డు పైనే కంకర అలాగే ఉంచడంతో జారుతుంది. దీంతో వాహనదారులు ఆదమరిస్తే వాహనాలు స్కిడ్ అయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు నిత్యం ఇదే రోడ్డుపై వెళ్తున్నప్పటికీ కంకరను తొలగించే ప్రయత్నం చే యలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంకరను తొలగించాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

30 వరకు అడ్మిషన్లు

కాటారం: ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా అపరాద రుసుంతో ఈ నెల 30 వరకు ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్‌లో అడ్మిషన్స్ కోసం అవకాశం కల్పించినట్లు కాటారం వివేకానంద ఓపెన్ స్కూల్ సెంటర్ కోఆర్డినేటర్ వలుస వెంకటేశ్వర్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో లేదా సెల్ నంబర్ 9440399715లో సంప్రదించాలని కోరారు.

మినీ డెయిరీ పైలెట్ ప్రాజెక్ట్‌తో సాయం

గోవిందరావుపేట: మండలంలోని ఎస్సీలకు మినీ డెయిరీ పైలెట్ ప్రాజెక్ట్ ద్వారా 22 కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ఎంపీడీఓ జవహర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్క యూనిట్ విలువ రూ.2 లక్షలు ఉంటుందని ఈ సాయం కింద మినీ డైయిరీ ప్రాజెక్ట్ ద్వారా రెండు గేదెలను తీసుకోవాలని అన్నారు. రుణం పొందిన లబ్ధిదారుడు రూ.2 లక్షల రుపాయల్లో రూ.1 లక్ష 40 వేలు సబ్సిడి కాగా మిగితా రూ.60 వేలు బ్యాంక్ లోన్ అని తెలిపారు. ఈ నెల 30న ఉదయం 11 గంటల 30 నిమిషాలకు ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి కమిటీ ద్వారా జాయింట్ స్క్రీనింగ్ నిర్వహించబడునని అన్నారు. అభ్యర్థులు ధ్రువీకరణ పత్రములతో హాజరు కావాలని తెలిపారు. అర్హత గల కుటుంబాలను బ్యాంకర్ సమ్మతితో ఎంపిక చేయబడునని అన్నారు. గోవిందరావుపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా 11 మంది, ఏపీజీవీబీ పస్రా శాఖ ద్వారా మరో 11 మంది లబ్ధిపొందనున్నారని తెలిపారు.

వృథాగా సాగునీరు



గోవిందరావుపేట: మండలంలోని లక్నవరం సరస్సులోని సాగునీరు వృథాగా పోతుంది. రెండు రోజుల క్రితం నర్సింహుల కాల్వ నీటిని విడుదల చేశారు. కాల్వలో అక్కడక్కడ పంట పొలాల్లోకి నీటిని విడుదల చేయడానికి తూముల వద్ద షట్టర్లు ఉండగా తుప్పు పట్టయడంతో తీసివేశారు. కానీ మళ్లీ వాటి కొత్త షట్టర్లు బిగించలేదు. దీంతో నీరు వృథాగా పోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి షట్టర్లు బిగించాలని రైతులు కోరుతున్నారు. ఇలాగే నీరు వృథా పోతే యాసంగి పంటకు నీరు సరిపోక పంటలు ఎండిపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

‘ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు’

- మాజీ జెడ్పీటీసీ కొండ రాజమ్మ.



మాట్లాడుతున్న రాజమ్మ

కాటారం: రాష్ట్రంతో పాటు మంథని నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబుపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని మల్హర్ మాజీ జెడ్పీటీసీ కొండ రాజమ్మ, కాంగ్రెస్ మండల మహిళ అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. మహదేవపూర్‌లో బీఆర్ఎస్ నాయకురాలు గీతాబాయి మంత్రిపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఊసరవెల్లిలా పార్టీలు మారుస్తున్న గీతాబాయి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతుందని విమర్శించారు. మంత్రి శ్రీధర్‌బాబు, శ్రీనుబాబును విమర్శించే స్థాయి ఆమెది కాదన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ అంశంలో మంత్రికి, ఆయన సోదరుడికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ సమావేశంలో మహిళా నాయకురాళ్లు అయిత శకుంతల, తదితరులు పాల్గొన్నారు.

డీసీఆర్బీ డీఎస్పీగా కిశోర్



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ

ములుగు: జిల్లా క్రైం రికార్డ్స్ బ్యూరో(డీసీఆర్బీ) డీఎస్పీగా కిశోర్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ శబరీశ్‌కు పూలమొక్కను అందించి మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కాళేశ్వరం: పరామర్శిస్తున్న మధు

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మణ్‌రావు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంగళవారం పరామర్శించారు. లక్ష్మణ్‌రావు మృతదేహానికి పార్టీ కండువా కప్పి, పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివాసరావు, రాజేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన కారుపాక కొమురమ్మ కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు కేదారి గీత, శ్రీపతి బాపు, అలీంఖాన్, జవ్వాజీ తిరుపతి, మహేష్, సల్మాన్ ఉన్నారు.

మంత్రి పరామర్శ

మహదేవపూర్ బొమ్మాపూర్, బ్రాహ్మణపల్లి, మహదేవపూర్, కుదురుపల్లిలో పలువురు కుటుంబాలను మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం పరామర్శించారు. అలాగే రాత్రి కాళేశ్వరంలో ఇటీవల మృతి చెందిన మాచెర్ల సారయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.

భిక్షాటన చేసి నిరసన

ములుగు: సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మె కార్యక్రమంలో భాగంగా 15వ రోజు జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి, ఆయా కాలనీల్లోని దుకాణాలు, కార్యాలయాల్లో భిక్షాటన చేసి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి, కరుణాకర్ ఉన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

సమగ్రశిక్ష ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని టీపీటీఎఫ్ సీనియర్ నాయకుడు దిలీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీక్ష శిబిరం వద్ద ఆయన మాట్లాడుతూ.. సమగ్రశిక్ష ఉద్యోగుల విషయంలో శాసనసభలో లేవనెత్తకపోవడం బాధాకరం అని అన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 26న హైదరాబాద్‌లో చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీనియర్ నాయకుడు హట్కర్ సమ్మయ్య పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏఓకు మెమోరాండం అందించారు.

కళాకారుడికి సన్మానం



రేగొండ: రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ యువ కళావాహిని, రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కొత్తపల్లిగోరి మండల కేంద్రానికి చెందిన కళాకారుడికి నిమ్మల రాజును రవీంద్ర భారతిలో నగదు పురస్కారంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. జిల్లాలోని జానపద కళాకారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు.

మోడల్ స్కూల్‌లో నాణ్యమైన విద్య

- ప్రిన్సిపాల్ తాళ్లపెల్లి రాకేశ్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

టేకుమట్ల: కార్పొరేట్‌కు దీటుగా మోడల్ స్కూల్‌లో నాణ్యమైన విద్య లభిస్తుందని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కొర్కిశాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తాళ్లపెల్లి రాకేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని అంకుసాపూర్, సోమనపల్లి, సుబ్బక్కపల్లి, ఆసిరెడ్డిపల్లి గ్రామాల్లో కొర్కిశాల మోడల్ ఉపాధ్యాయ బృందం మోడల్ స్కూల్ ప్రవేశాల కర పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మోడల్ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమంలో విద్యాభ్యాసం కొనసాగుతుందని, కావున పట్టణాలకు పిల్లల్ని పంపించకుండా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొగుళ్లపల్లి మండలంలోని కొర్కిశాల మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో 100 సీట్లు, 7, 8, 9, 10 తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం ప్రవేశాలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దూర ప్రాంత విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపు కొమురెల్లి, యార దేవేందర్, అందె కుమార్, అజయ్, మార్క కిరణ్, పోతుగంటి మహేష్, గొడ రాజ్‌కుమార్ ఉన్నారు.

పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ సంబురాల్లో విద్యార్థులు

కాటారం: మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు క్రిస్మస్ తాతయ్య, క్రైస్తవ మతస్తుల వేషాధారణలో అలరించారు. కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వలుస వెంకటేశ్వర్లు, డీఐఓ వెంకన్న మాట్లాడుతూ.. నేటి సమాజంలో శాంతి, ప్రేమ, సహృదయంతో కూడిన భావనలు విరజిల్లాలంటే యేసు మార్గం తప్పనిసరిగా అనుసరించాలని తెలిపారు. క్రిస్మస్ తాతయ్య వేషాధారణతో సైఫ్‌ఖాన్, శాంతాక్లజ్‌గా వర్షిణి వ్యవహరించగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వలుస వందన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాక్‌పీస్‌పై క్రిస్మస్ ఆకృతులు

- చిత్రకళ ఉపాధ్యాయుడు రజనీకాంత్ ప్రతిభ



రజనీకాంత్



చాక్‌పీస్‌పై రజనీకాంత్ తయారు చేసిన క్రిస్మస్ ఆకృతులు

కాటారం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఆర్ట్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆడెపు రజనీకాంత్ సూక్ష్మ కళాకృతులను తయారు చేసి అబ్బురపరుస్తున్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని రజనీకాంత్ చాక్‌పీస్‌పై ఏసుక్రీస్తూ, ఆంగ్ల అక్షరాలతో హ్యాపీ క్రిస్మస్, క్రిస్మస్ స్టార్, శాంటాక్లాజ్ ఆకృతులను తయారు చేశారు. 3 సెంటిమీటర్ల ఎత్తు ఉన్న చాక్‌పీస్‌పై ఏసుక్రీస్తును, 2 మిల్లీమీటర్ల ఎత్తు, 2 మిల్లీమీటర్ల వెడెల్పు ఉన్న చాక్‌పీస్‌పై హ్యాపీ క్రిస్మస్ ఆంగ్ల అక్షరాలు మూడు గంటల పాటు శ్రమించి రూపొందించి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాకుండా ఒక సెంటిమీటర్ వెడెల్పున్న క్రిస్మస్ స్టార్, పిల్లలకు బహుమతులుగా తీసుకొచ్చే శాంటాక్లాజ్‌ను, 2 సెంటిమీటర్ల ఎత్తు, 8 మిల్లీమీటర్ల వెడెల్పుతో క్రిస్మస్ ట్రీని గుండు పిన్ను సహాయంతో నాలుగు గంటల పాటు శ్రమించి తయారు చేసినట్లు రజనీకాంత్ తెలిపారు. రజనీకాంత్ గతంలో ఇలాంటి సూక్ష్మ కళాఖండాలు సృష్టించడంతో పాటు సమరయోధుల ఫొటోలను రూపొందించడం, బియ్యపు గింజలపై 278 అక్షరాల జాతీయ గీతం, జాతీయ గేయం రాసి బుక్ ఆఫ్ స్టేట్ రికార్డ్, సృజనపుత్ర, కళారత్న, రికార్డ్ హోల్డర్స్ రిపబ్లిక్ ఇండియా రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు, తెలుగ్‌బుక్ ఆఫ్ రికార్డులను సొంతం చేసుకొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

- ఎన్‌హెచ్‌ఆర్‌సీ మండల అధ్యక్షుడు కిరణ్



మాట్లాడుతున్న శాస్త్రాల కిరణ్

టేకుమట్ల: గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూములను కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందించాలని ఎన్‌హెచ్‌ఆర్‌సీ మండల అధ్యక్షుడు శాస్త్రాల కిరణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మంచిర్యాల నుంచి వరంగల్ వరకు నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ హైవే 163 కారిడార్ కోసం 2019 నుంచి రైతుల భూములను తీసుకునేందుకు చేస్తూ ముందుకు సాగుతుందని అన్నారు. ఎకరాకు రూ.30లక్షలను చెల్లించేందుకు కలెక్టర్ హామీ ఇవ్వడంతో రైతుల అంగీకరించారని అన్నారు. టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల్లో సుమారు 26 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పుతున్న రైతులకు ఇప్పటి వరకు పరిహారం చెల్లించలేదన్నారు. పరిహారం చెల్లించి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని, లేని పక్షంలో నిర్మాణాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎన్‌హెచ్‌ఆర్‌సీ మండల ప్రధాన కార్యదర్శి నాంపెల్లి వీరేశం, కోలుగూరి కైరత్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రేగొండ: కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ఇరవై ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఆనాటి జ్ఞాపకాలను, మధుర స్మృతులను నెమర వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు లక్ష్మణ్, పద్మ, శ్రీనివాస్, రాజేందర్, సుదయ్య, వేణుగోపాల ఆచార్యలను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు శ్రావణి, రమ, స్వప్న, శ్రీలత, రాజు, రాజేష్, భారతి, వెంకటేష్, వినోద్, తిరుపతి, రమేశ్, ప్రభాకర్, చైతన్య, రత్నాకర్, రజిత, స్వరూప, మధుకర్ పాల్గొన్నారు.